క్లుప్తంగా

పోస్టల్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



నర్సంపేట : జాతీయ పోస్టల్ శాఖ ఆధ్వర్యం లో అమలు అవుతున్న దీన్ దయాల్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్‌నకు పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ శాఖ నర్సంపేట ఇన్‌స్పెక్టర్ సుచేందర్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ జావెద్ విద్యార్థులను శుక్రవారం అభినందించి మాట్లాడారు. స్కూల్‌లో 9వ తరగతి చదువు తున్న స్పందన, మామిడాల యశ్వంత్, ఏడో తరగతి విద్యార్థులు అసద్, షహజాద్, కొప్పు యశ్వంత్, సుశాంత్, రాజు, భవ్యశ్రీ, రిషిత వివిధ అంశాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులను సమర్పించి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థు లకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను నెలకు రూ.500 చొప్పున స్కాలర్‌షిప్ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమం లో స్కూల్ కరస్పాండెంట్ జహంగీర్, అకడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, పోస్టల్ ఉద్యోగి అశోక్, గైడ్ టీచర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ' ఆమోదించాకే నియామకాలు చేపట్టాలి



సంగెం : అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాకే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల్లో నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలకు రమేశ్ హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి తదనంతరం విస్మరిస్తున్నారని విమర్శించారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండానే గ్రూప్-1, 2, 3 ఫలితాలు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఎస్సీలకు తీరని అన్యాయం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత విధానాలు అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ఎస్సీ వర్గీకరణను ఆమోదించి చట్టబద్ధత కల్పించాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళిత యువత రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా స్పందించకుండా గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియమకాలు చేపడితే సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దామెర కిశోర్, కార్యదర్శి కోడూరి రాజు, నాయకులు మనోహర్, బాబు, చరణ్, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

'స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు హేయం'

వర్ధన్నపేట : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ పార్టీ నేత, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళితుడనే చులకన భావంతోనే స్పీకర్ ప్రసాద్‌ను ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దూషించి అవమానించాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే జగదీశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేతలకు దళితుల పట్ల వివక్ష ఉందన్నారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. జగదీశ్వర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి భవిష్యత్తులో దళితులను అవమానపర్చకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

మత సామరస్యానికి నిదర్శనమే ఉపవాస దీక్ష

ఖిలా వరంగల్ : శాంతి, సామరస్యానికి పవిత్ర రంజాన్ మాసంలోని ఉపవాస దీక్ష ప్రతీక అని ఈద్గా మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ ఈద్గా మసీదులో తవక్కుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం, హిందువుల ఐక్యతకు రంజాన్ నిదర్శనం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ.చాంద్‌పాషా, ఎండీ.హసన్ బేక్, షబ్బీర్, సాదిక్, అంకుష్, ఇంతియాజ్, దస్తగిరి, మాషుక్, సర్వర్, మహిబూబ్, వహీద్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : హోలీ ఆడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్, తదితరులు



నెక్కొండ : హోలీ ఆడుతున్న వ్యాపారులు, నాయకులు, తదితరులు



నర్సంపేట : చెన్నారావుపేటలో..



ఘనంగా హోలీ వేడుకలు

జిల్లావ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దలు, వృద్ధులు, చిన్నారులు, యువత వయోభేదం మరచి రంగులు పూసుకుంటూ పండుగ చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే పల్లెల్లో, పట్టణాల్లో హోలీ సందడి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హోలీ వేడుకల్లో భాగస్వాములై సందడి చేశారు. నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తదితరులు జనంతో మమేకమయ్యారు. పలు చోట్ల ప్రజలు సంప్రదాయ రంగులు పూసుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముఖ్యకూడళ్లలో, చెరువుల వద్ద బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



నల్లబెల్లి : హోలీ వేడుకల్లో యువత, నాయకులు



పర్వతగిరి : మండల కేంద్రంలో హోలీ ఆడుతున్న మహిళలు



దుగ్గొండి : హోలీ ఆడుతున్న యువకులు, నాయకులు



ఖానాపురం : హోలీ ఆడుతున్న నాయకులు, యువకులు



నర్సంపేట రూరల్ : ఇటుకాలపల్లిలో..



సంగెం : వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు



రాయపర్తి : కొండూరులో హోలీ ఆడుతున్న యువకులు

యథేచ్ఛగా ఇటుక బట్టీలు

- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- అక్రమంగా కలప, మట్టి తరలింపు

నెక్కొండ : మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను యాజమాన్యాలు పాటించడం లేదు. అక్రమంగా కలప, మట్టి తరలిస్తున్నారు. నిర్వాహకులు ఏటా ఇష్టారీతిన బట్టీలు ఏర్పాటు చేసి కలపతో కాల్చడంతో పొగ, దుమ్ము ధూళితో సమీప నివాసాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్ల వెంటే..

మండలంలోని అమీన్‌పేట శివారులో వట్టివాగు సమీపంలో, సూరిపల్లి శివారులోని ప్రధాన రోడ్డు వెంట అనుతులు లేకుండా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాన రోడ్ల వెంట వెళ్లే వాహనదారులు పొగ దుమ్ము, ధూళితో పలు మార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. అయినా మైనింగ్, పంచాయతీరాజ్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేకపోవడం గమనార్హం.



వట్టి వాగు సమీపంలో రహదారి వెంట ఉన్న ఇటుక బట్టీ

అనుమతులు తప్పనిసరి



ఇటుక బట్టీల నిర్వాహకులు తప్పనిసరిగా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి ముందస్తుగా అనుమతులు పొందాలి. ప్రజలు, స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామాలకు దూర ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలి. సంబంధిత శాఖల నుంచి అవసరమైన పత్రాలు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు.

– ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, నెక్కొండ

సాగు భూముల్లో..

వ్యవసాయానికి అనువుకాని భూముల్లో ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకోవాల్సిన నిర్వాహకులు అందుకు భిన్నంగా ఏకంగా వ్యవసాయ భూముల్లోనే బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సమీప పొలాల్లోని పంటలు దెబ్బతింటున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. నివాస గృహాలకు దూరంగా నిర్వహించాల్సి నిర్వాహకులు తట్టింపులేమితో బట్టీల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వేసవిలో వడగాల్పుతో నివాస గృహాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి : మండలంలోని కేశవాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సందర్భంగా శుక్రవారం నాడు శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. తొలుత శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను వేర్వేరుగా పెళ్లికూతుర్లు, పెళ్లి కొడుకుగా తీర్చిదిద్దారు. అనంతరం అర్చకులు దేశికన్‌చార్యులు, రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా అర్చకుడు దేశికన్ ఆచార్యులు మాట్లాడారు. దేవతలకు ఏటా కల్యాణం జరిపించడం అవసరమని చెప్పారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గురుడ వాహనంపై ఊరేగించారు. ప్రజలు స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంది తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి రమ దంపతులు, అర్చకులు ప్రదీప్, సాగర్, ఆలయ నిర్వహణ బాధ్యులు కిరణ్‌కుమార్, అశోక్, మందపల్లి భజన మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రాయపర్తి : మండలంలోని బంధనపల్లి గ్రామంలో సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతీ ఏటా హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని బంధనపల్లి, కొత్తూరు గ్రామాల ప్రజలు ఉమ్మడిగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ జాతరకు రెండు గ్రామాల ప్రజలతోపాటు మండలం నుంచి ప్రజలు తరలిరావడంతో సందడి నెలకొంది. కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యనాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, చిర్ర మల్లయ్య, బ్రహ్మోత్సవాల నిర్వాహకులు, మాజీ సర్పంచ్ కొడగాని ఉమాయాదగిరి, కిషన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే చట్టాల సద్వినియోగం

- మండలి అధ్యక్షుడు రతన్‌సింగ్

నర్సంపేట : అవగాహన ఉంటేనే చట్టాలను సద్వినియోగం చేసుకోగలరని వినియోగదారుల మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్‌సింగ్ స్పష్టం చేశారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో డైరెక్టర్ జావెద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారులు నాణ్యమైన వస్తువులు, సరుకులు మాత్రమే కొనుగోలు చేయడాన్ని హక్కుగా భావించాలని సూచించారు. వినియోగదారులకు పరిహారం పొందే హక్కు సైతం ఉంటుందని తెలిపారు. మండలి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతిదాన్నీ నిశితంగా పరిశీలించి నాణ్యతలో తేడా ఉంటే వెంటనే సమాచార, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నాణ్యమైన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పారు. వినియోగదారుల చట్టంలోని అంశాలు, హక్కులపై ప్రజలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, రియాజ్, రాజేశ్, రవీందర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రతన్‌సింగ్

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా

- డీఈ ఆనందం

నర్సంపేట రూరల్ : వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ డీఈ (టెక్నికల్) ఆనందం తెలిపారు. నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లిలో ఆ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ సరఫరాలో చోటు చేసుకుంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డీఈ ఆనందం మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెప్పారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంలో లోటుపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే సమస్యలు తెలుసుకునే దిశగా పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అత్యంత కీలకమన్నారు. విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తారని వివరించారు. కార్యకమంలో నర్సంపేట రూరల్ ఏడీఈ రాజేశ్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈ ఆనందం, అధికారులు

ఏటీఎం.. నిరుపయోగం

- నెల రోజులుగా పని చేయని దుస్థితి

సంగెం : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఏటీఎం నిరుపయోగంగా మారింది. నెల రోజు లుగా ఏటీఎం మూసి ఉంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా గ్రామాల్లో బ్యాంకు మిత్రలను ఇటీవల తొలగించడంతో ఖాతాదారులు నగదు కోసం ఏటీఎం వద్దకు వచ్చి అది పని చేయక నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో నగదు డ్రా చేసుకునేందుకు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఏటీఎం ఆశ్రయించి ఇబ్బంది పడాల్సి వస్తోంది. అందులో తక్కువ మొత్తంలో డబ్బులు రావడమే కాకుండా ప్రతి రూ.20 వేలకు రూ.126 చొప్పున కోత పెడుతున్నట్లు ఖాతాదారులు తెలిపారు. అంతే కాకుండా ప్రైవేట్ ఏటీఎం అయిన క్రమంలో నగదు ఉపసంహరణపై వెయ్యికి రూ.10–20 వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



క్యాష్ డిపాజిట్ కోసమూ తిప్పలు

ఏటీఎం ద్వారా నగదును డ్రా చేసుకోవడంతోపాటు అకౌంట్లలో డిపాజిట్ చేసుకునేలా క్యాష్ డిపాజిట్ మెషీన్ సైతం ఏటీఎం సెంటర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. బ్యాంకు సెలవు రోజుల్లో, బ్యాంకు సమయానికి ముందు, తదనంతరం నగదు డిపాజిట్, ఉపసంహరణ వంటి సేవలు అందడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఏటీఎం సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బు కోసం వస్తే మూసి ఉంది



డబ్బు అత్యవసరం ఉండి ఏటీఎం నుంచి డ్రా చేయడానికి వస్తే ఏటీఎం మూసి ఉంది. బ్యాంకు పని వేళల సమయం ముగిసిపోయింది. నగదు అవసరం తీరేదెలా..? ఎప్పుడు చూసినా ఏటీఎం మూసి ఉంటోంది. అకౌంట్‌లో డబ్బు ఉండి కూడా అవసరానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. బ్యాంకు అధికారులు ఏటీఎంను వినియోగంలోకి తీసుకురావాలి.

– ఓరుగంటి స్వామి, చింతలపల్లి

విద్యుత్ సమస్యతోనే..

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఏటీఎం చెడిపోయింది. నాటి నుంచి మూసి ఉంటోంది. దాని స్థానంలో మరోకటి ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేయాల్సి ఉంటుంది. ఏటీఎం చెడిపోయిన విషయాన్ని ప్రధాన కార్యాలయ అధికారులకు తెలియజేశాం. త్వరలో మరో ఏటీఎం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం.

– యాకర అనిల్, సీనియర్ మేనేజర్, యూబీఐ

మైనార్టీ పాఠశాలలో చేర్పించాలి

దామెర : విద్యార్థులను మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో చేర్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలాని బాబా దర్గాలో శుక్రవారం ములుగు మైనారిటీ పాఠశాల ఉపాధ్యాయులు కరపత్రాలతో ప్రచారం చేయగా ప్రిన్సిపాల్ మాట్లా డారు. మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థులు చేరాలని కోరారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చర్యలు

దామెర : అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. మండలంలోని ల్యాదళ్లలో శుక్రవారం మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వివరాలు వెల్లడించారు. ల్యాదెళ్ల శివారులో ఇసుక లోడ్‌తో వెళ్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని తనిఖీ చేయగా కమలాపూర్ మండలంలోని జూజునగర్ నుంచి అనుమతులు లేకుండా వరంగల్‌కు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.